ప్రతి నిర్మాణం పునాదుల్లోనూ శ్రామికుల, కార్మికుల స్వేదమూ, అశ్రువులూ, రక్తమూ ఉంటూనే ఉంటాయి. శతాబ్దాలుగా చరిత్ర చెప్తున్న కఠోర సత్యం ఇది!

# సమిధలు

**తూ**ర్పు కనుమల్లో చెదురుమదురుగా విసిరేసినట్లున్న చిన్నా పెద్దా కొండలూ వాటి మధ్య చిన్న, చిన్న లోయలూ, చదును ప్రాంతాలతో, బ్రహ్మదేవుడు విలాసంగా షికారు చేయడం కోసం నిర్మించుకున్న ఉద్యానవనంలా ఉంటుంది ఉత్తరాంధ్ర. వాటిలో సుమారు పెద్ద సైజు కొండ పెనుగొండ. ఆ కొండమ్మ తల్లి పాదం చుట్టూ అనుకున్న అందెలా ఉంటుంది గునుపూడి. పెనుగొండకి ఉత్తరపు చివర్న అడ్డంగా మరో రెండు చిన్న కొండలు ఆ ఉద్యానవనంలో విరబూసిన ముద్దబంతి పూవుల్లా విరాజిల్లుతుంటాయి. ఆ రెండు కొండల దిగువగా అన్నదమ్ముల్లా రెండు పల్లెటూళ్ళు వెదురు పల్లి, గుమ్మడికొండ. బహుశా ఆయా కొండల్లో అడివిగా పెరిగే వృక్షజాతుల్ని బట్టి ఆ ఊళ్ళకా పేర్లు వచ్చి ఉండవచ్చు. దగ్గరగా చేతులు కలుపుతున్నట్టున్న ఆ రెండు కొండల వెనకా పెద్ద మైదానం, లోయ. ఇంకా పైన ఎక్కడో కొండల్లో పడిన వర్షపు నీరు ఆధారంగా, ఆ మైదానంలోంచి చిన్నగా లోయల ద్వారా ప్రవహిస్తూంటుంది 'నల్ల కొండమ్మ వాగు' . ఆ వాగు వంకర్లు తిరిగి లోయల్లోంచి వస్తూ, గునుపూడికి దిగువగా చుట్టూ ఉన్న కొండల్లోంచి ప్రవహించే నీటిని తనలో ఐక్యం చేసుకుంటూ 'తాండవ నది'గా మారి, తుని మీదుగా, పెంటకోట వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఒయ్యారాలొలికే నవజవ్వనిలా 'తాండవ' చేసే నృత్యలీల ఆ ఉద్యానవనంలో బ్రహ్మదేవుడి విలాసాలకి పరాకాష్ట.

ఈ ప్రాంతాల ప్రజలు అతి నాగరికులు కారు. అంటే అమెరికా వారు బుధగ్రహంలోకి చొచ్చుకుపోయారన్నా, భారతదేశం పోక్రాన్‌లో అణు బాంబుని పేల్చిందన్నా "ఓహో! అలాగా!" అనుకుంటారు. ఆ సంఘటనలకి అంత ప్రాముఖ్యం ఎందుకో, అవి వారి దైనందిన జీవితాల్ని ఎలా మారుస్తాయో వారికి అవగాహన లేదు. అలాగని వారంతా అనాగరికులు కారు. నిజానికి అసలు ఆటవిక జాతి వారైనా చెంచులు, కోయలు, గోండులు లాంటి వాళ్లు నల్లకొండమ్మ వాగుకి ఎగువగా, కొండల్లోకి సరుగుడు, మాసంపేట వంటి గూడాల్లో ఉంటారు. వారి కసలు బైటి ప్రపంచంతో సంబంధమే లేదు. మహా వస్తే వారు ఏ చింతపండో అమ్ముకోవడానికి గునుపూడి దాకా వస్తారేమో!

కాలం సజావుగా ఉన్న రోజుల్లో, ఆయా ప్రాంతాల ప్రజలు, పల్లపు ప్రాంతాల్లో, వరిసాగు చేసుకునీ, మెట్ట ప్రాంతాల్లో జొన్న, గంటి వంటి మెరక పైరులు వేసుకునీ పొట్ట పోషించుకుంటారు. అప్పుడప్పుడూ ప్రకృతి చేసే భీభత్సకాండకి తట్టుకోలేక తోటకూరకాడల్లా అల్లల్లాడిపోతూంటారు. విపరీతమైన వర్షాల వల్ల 'తాండవ'కి వరదలు వచ్చినప్పుడు పల్లపు పంటలన్నీ కొట్టుకు పోతాయి. వర్షాలు లేక మెట్ట పైరులు ఎండిపోతూంటాయి. ఒక్కోసారి ఎండాకాలంలో హుతాశనుడు విజృంభించి కొండల మీది చెట్టూ చేమల్ని కాల్చి బూడిద చేసేస్తాడు. భూమి పుట్టినప్పట్నుంచీ జరుగుతున్న ఈ సృష్టి, స్థితి, లయ లీలలకి అక్కడి కొండలు, కోనలు మూగసాక్షులుగా దర్శనమిస్తూంటాయి.

చాలా కాలం క్రిందట, అంటే భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, తెల్లదొరల దొరతనం చలామణీ అయ్యే రోజుల్లో అక్కడికి ఓ తెల్లదొర జిల్లా కలెక్టరుగా వచ్చాడు. ఎగుడు, దిగుడుగా ఉండే ఆ ప్రదేశాల్లో మరొక ప్రయాణ సాధనం ఏదీ లేక, కాలినడకన తిరగలేక, అప్పటి అధికార్లు గుర్రాల మీద ప్రయాణం చేసేవారు. అలా గుర్రం మీద సవారి చేస్తూ ఆ తెల్లదొర ఓనాడు పెదురుపల్లి, గుమ్మడికొండల దగ్గర ఆగి, అక్కడి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడై, అప్రతిభుడై, గుర్రాన్ని నిలబెట్టి అలా చూస్తూ ఉండిపోయాడు. జమా జెట్టీల్లాంటి అన్నదమ్ముల్లా రెండు ఎత్తైన కొండలు, వాటి వెనుకగా పెద్ద మైదానం, కనుచూపు మేరలో భూమిని చుంబిస్తూ ఆకాశం, అక్కడి నుంచి చుక్కా, చుక్కా నీరు నింపుకుంటూ చిన్నగా ప్రవహిస్తున్న నల్లకొండమ్మ వాగు! ఎంతటి మనోహరమైన దృశ్యం! మనసున్న ఏ మానవుడినైనా పట్టి ఉర్రూతలూగించగల ప్రకృతి. ఎల్లలు దాటి వచ్చిన తెల్లదొరని సైతం మైరపింప జేసిందంటే....చేయదూ...మరి!...కానీ.....

కానీ, ఇక్కడే తెల్లవాడు తెల్లవాడేనని నిరూపించాడా తెల్లదొర. అలా చూస్తూ నిలబడిన తెల్లదొర తెల్లని బుర్రలో ఒక ఆలోచన అంకురించింది. అది 'ఇంతింతై వటుడింతై' అన్నట్టుగా నిమిషాల మీద మనోరూపధారణ చేసింది. ఈ రెండు కొండలూ ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉన్నాయి. వాటిని కలుపుతూ మధ్యలో ఓ గోడ లాంటిది కట్టేస్తే, వాగులోని నీరు. వెనక ప్రక్క మైదానంలో నిండి ఓ పెద్ద రిజర్వాయరుగా మారుతుంది. దానితో, ఒకే దెబ్బకు రెండు పిట్టల్లా, అటు తాండవకి వచ్చే వరదల్ని అరికట్టవచ్చు; ఇటు లక్షల ఎకరాల మెరక భూముల్ని పల్లాలుగా మార్చి బంగారం పండించవచ్చు. ఆ బంగారం అంతా ఓడల్లో వేసి 'లండను'కి తరలించవచ్చు. ఇది జరిగితే బ్రిటిషు గవర్నమెంటులో ప్రమోషన్లు పొందవచ్చు. అంతే! 'రాజు తల్చుకుంటే దెబ్బలకి కొదవా!' అన్నట్లు, తెల్లదొర దొరతనం వారికి రాయడం, వారు అంగీకరించి కార్యక్రమంలోకి దిగడం త్వరత్వరగా జరిగిపోయాయి. ఇంజనీర్లు, సర్వేయర్లు అంచెలంచెలుగా రావడం, రకరకాల పరీక్షలు చేయడం దినచర్య అయిపోయింది ఆ ప్రాంతాల్లో.

అతిథి సత్కారానికి మన భారతదేశం పెట్టింది పేరు. అందులోనూ ఆ అతిథి అధికారం గలవాడైతే ఇక చెప్పాలా! ఆ అధికారం కూడా మనకి సహాయపడడం కోసం అయితే ఓహ్! ఇక చెప్పవలసిందేముంది!! 'నల్లకొండమ్మ రిజర్వాయరు' పేరు మీద వచ్చిన అధికార్లకందరికీ

ఆ ప్రాంతాలలో ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. ఉన్నంతలో వారికి వసతి, భోజన సదుపాయాలు కలుగజేసి, వారున్నంత కాలం, చేదోడు వాదోడుగా ఉంటూ, 'అడివిలో వచ్చి పడ్డామేమిట్రా భగవంతుడా!' అని వారనుకోకుండా, వారిని ఆదరించి పంపేవారు అక్కడి ప్రజలు. మరి ఆ డాము కట్టడమే పూర్తయితే, సరిపడ్డంత నీటి సరఫరాతో అక్కడి మెరక భుములన్నీ పల్లాలయిపోతాయి. అంతా జొన్న అన్నం, చోడి అంబలి లాంటి మొరటు భోజనం కాకుండా 'వరి అన్నం' తినవచ్చు. రాకపోకలకి రోడ్లు, వాహనాలు, సౌకర్యాలు వస్తాయి. ఏ తుని లాంటి పట్నవాసానికో వెళ్లాలంటే మైళ్లకొద్దీ నడిచి పోనక్కర్లేదు. విద్య, వైద్యం వాటి సదుపాయాలు దగ్గరౌతాయి. ఈ జరగబోయే అభివృద్ధిని తల్చుకుని అక్కడి వారంతా పొంగిపోయారు.

విఘ్నేశ్వరుడి పెళ్లికి అన్నీ విఘ్నాలేనంటారు. అది సృష్టిలోని విచిత్రం. ఏ మంచి పనీ అనుకున్నంతలో అయిపోదు. కార్యదీక్ష, క్రమశిక్షణ, కృషి, అన్నటినీ మించి దైవ సహాయం ఉంటే అంచెలంచెలుగా అవరోధాల్ని దాటుకుంటూ అది పూర్తవుతుంది. దాని వలన ఫలితం మాత్రం అనూహ్యామైనది. అనన్య సామాన్యమైనదీ అవుతుంది. 'నల్లకొండమ్మ డాము'కి కూడా అలాంటి అవాంతరమే వచ్చి పడింది. గాంధీగారి స్వాతంత్ర్యోద్యమం బాగా పుంజుకుని ఫల రూపానికి దగ్గర్లో కొచ్చిన రోజులవి. మరి బ్రిటిషు ప్రభుత్వానికి ఈ విషయాలు పట్టించుకోవడానికి సమయమే చిక్కలేదో, ఎలాగూ దేశం వదిలిపోయే పరిస్థితి వచ్చింది కనుక, మనం మోసుకెళ్ళ లేని బంగారం భారతదేశంలో పండించి మాత్రం ఏం లాభం అనుకుందో, డాము మీద పని ఆగిపోయింది. స్వాతంత్ర్య సమరంలో చెలరేగిన ధూళి ప్రభుత్వ కార్యాలయంలోని ఆ పేపర్లపై దట్టంగా పేరుకుపోయింది. గునుపూడి ప్రజల ఉత్సాహం అంతా నీరుగారి పోయింది. ఆ 'నల్లకొండమ్మ తల్లి'కి మన మీద దయ లేదు అనుకున్నారు. ముందు తరాలవారైనా ఈ ప్రాజెక్టును కళ్లజూసి అభివృద్ధి పొందగలిగితే అదే చాలు అని సంతృప్తి చెందారు. దాని కోసం ఉద్యమం లేవదీయాలని కానీ, అలజడి చేయాలని కానీ, అక్కడి వారికి తెలియదు. అయినా అది పరాధీన ప్రభుత్వంలో మనకి పనికిరానిది. ఆ తరం అలా గడిచిపోయింది.

* * *

దరిమిలా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసింది. చాలామంది నాయకులు వారు చేసిన త్యాగాలు వట్టిపోకుండా దేశం ప్రగతి పథంలో ముందడుగు వేయాలన్న పట్టుదలతో, ప్రభుత్వ రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ప్రవేశించారు. అప్పటి నాయకులకి దేశాభివృద్ధి మాత్రమే ధ్యేయం. నిస్వార్థం, నీతి, నిజాయితీ మూల స్తంభాలుగా పురోభివృద్ధికి పునాదులు వేసినవారు వారు. అట్టివారిలో అప్పట్లో మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకాశం పంతులుగారు ముఖ్యులు. వారు రాష్ట్రాభివృద్ధికి తయారు చేసిన ప్రణాళికల పట్టీలో 'నల్లకొండమ్మ డాము' కూడా ఒకటి. దానితో ఆ ప్రాజక్టు కాగితాల మీద పట్టిన దుమ్ము దులపడం జరిగింది. మళ్ళీ చకచకా డాము పనులు జరగడం మొదలయ్యింది.

సంవత్సరాలు గడుస్తున్నాయి. ఎలక్షన్లొస్తున్నాయి. పోతున్నాయి. నాయకులొస్తున్నారు. పోతున్నారు. నల్లకొండమ్మ రిజర్వాయరు ప్రాతిపదికగా రాజకీయాలు నడుస్తున్నాయి. నాయకులు గెలుస్తున్నారు. ఓడుతున్నారు. ఆ నియోజకవర్గంలో అట్టి పరిస్థితిలోనే ఒక నాయకుడు నల్లకొండమ్మ వాగు మీది రిజర్వాయరుకి 'తాండవ' రిజర్వాయరుగా పేరు మార్పించాడు. దాని వల్ల ఎవరికేం ప్రయోజనం జరిగిందో ఆ నల్లకొండమ్మకే తెలియాలి. పేరులో ఏముంది, పని జరిగితే చాలు అని తృప్తిపడ్డారు జనం.

పెద్ద కంట్రాక్టర్లు వచ్చారు. పెద్ద పెద్ద పాషాణాల్ని మందుగుండు సామానుతో పేల్చి పగలకొడుతున్నారు. డాము సైటుకి దగ్గర్లో సిబ్బందికీ కాలనీ వెలిసింది. కాలనీకి, మెయిన్ రోడ్డుకీ వారధిలా 'నాతవరం' ఉండడంతో ఆ ఊరికి రద్దీ ఎక్కువైంది. జీపులు, కార్లు, ట్రక్కులు, పెద్ద పెద్ద ఇంజన్లు దిగుమతి చేయబడుతున్నాయి. ఒకప్పుడు పల్లెటూరుగా ఉండే నాతవరానికి ఇప్పుడు పట్టణం రూపు వచ్చేసింది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలకి చేతి నిండా పని దొరకింది. సాధారణంగా వారికి సంవత్సరంలో ఏ కొద్ది రోజులో తప్ప ఎక్కువ పని ఉండదు. అలాంటిది ప్రాజెక్టు వర్కులో సంవత్సరం పొడుగునా ఉపాధి దొరికింది. ఎంతో మంది కూలీ నాలీ చేసుకుని రెండు పూటలా తింటున్నారు.

* * *

గునుపూడిలో కొండయ్య కూడా రైతు కూలీ. ఉన్నప్పుడు తినీ, లేనప్పుడు పస్తులుండీ, కాలం గడుపుతుండేది అతని కుటుంబం. 'వేన్నీళ్లకి చన్నీళ్ళు తోడు' అన్నట్టుగా పదిహేడేళ్ల కొడుకుని కరణం కొండబాబుగారి పశువుల కాపరిగా 'పందుం' గింజల జీతానికి కుదిర్చాడు. వాడి పేరు పరదేశి. మూకుమ్మడిగా డాము సైటుకి కూలికి పోతున్న 'గాంగు' కూలీలని చూసి కొండయ్యకీ ఆశ కలిగింది తనూ వాళ్లతో చేరిపోతే నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చునని. వయసు కాదంటున్నా వెళ్లి చేరాడు. త్వరలోనే అది బాగా గిట్టుబాటుగా ఉందనిపించింది. అప్పటిదాకా కరణం గారిచ్చిన గోచి పాత తప్ప ఒంటి మీద బట్టలెరుగని కొండయ్య జీవితంలో మొదటిసారిగా ఖద్దరు గుడ్డ కొనుక్కొని చొక్కా కుట్టించుకున్నాడు. గావంచా కొనుక్కున్నాడు. వారం వారం మేస్త్రీ బట్వాడా చేసే రోజు కూలి చేతిలో పంటగా పడేది. చాలా మంది చిన్నకారు రైతులకి సైతం, సంవత్సరం అంతా రెక్కలు ముక్కలు చేసుకుని కాయకష్టం చేస్తే, బొటాబొటీగా తిండికి సరిపడ గింజలైనా పండించలేని వ్యవసాయం కన్న రోజు కూలిలో వారం వారం పండే పంటలో వారికి బంగారు భవిష్యత్తు కనిపించసాగింది. ఎందరో కూలి పన్లకి ఎగబడడం మొదలు పెట్టారు. ఎవరికుండదు డబ్బు గడిద్దామని? హాయిగా బతుకుదామని!!

ఇలా ఉండగా కొండయ్య మనసులో మరో ఆలోచన పురుగులా దొలిచేయసాగింది. ఎలాగైనా కొడుకు పరదేశిని కూడా పాలికాపుతనం నుంచి తప్పించి, తనతో కూలి పనికి తీసుకుపోతే వాళ్ల సంపాదన రెట్టింపు అవుతుంది. కానీ కరణంబాబు కోపిస్తాడేమో! అధికార్ల కోపం అనాథల ప్రాణసంకటం కదా అని చాలాకాలం ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆఖరికి

ధైర్యం చేసి ఓనాడు కరణంగారి ముందు తన ఆలోచన బైట పెట్టాడు. ఆయనా ఏ కళనున్నాడో అభ్యంతరం చెప్పలేదు.

"ఒరే కొండయ్యా! నువ్వే ఆలోచించుకో! నీ కుటుంబం బాగుపడుతుందంటే నేను దానికి అడ్డుపెట్టను. కానీ అందరూ 'పాలో'మని సైటుకి పోయి చచ్చేకంటే వాడిక్కడే ఉండి, నా పశువుల్ని కాస్తూ, నీ కుటుంబానికి సహాయంగా ఉంటే, నువ్వక్కడ చీకూ చింత లేకుండా కూలి పనిచేసుకోవచ్చు. ఇక్కడ పిల్లా, పీచూ, రోగం రొష్టూ చూసుకునే వాళ్లుండాలి కదా! నాకు తోచింది చెప్పాను. తర్వాత నీ యిష్టం" అన్నారు.

ఆయన చెప్పిన దాంట్లో తనపై అభిమానం కంటే ఆయన స్వార్థమే ఎక్కువనిపించింది కొండయ్యకి. ఆఖరికి పరదేశిని తనతో బాటు తీసికెళ్లిపోడానికే నిశ్చయించుకుని ఆ విషయం ఆయనకు చెప్పాడు.

✷ ✷ ✷

కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు. మారడం దాని సహజ గుణం. వర్షాకాలం పోయి చలికాలం వస్తుంది. చలి కాలం పోయి ఎండా కాలం వస్తుంది. గ్రీష్మఋతువులో ఎండలు మండిపోతుంటాయి. తూర్పు కనుమల్లో ఇప్పుడు గ్రీష్మ ఋతువే నడుస్తోంది. గునుపూడిలో ఎండ నిప్పులు చెరుగుతోంది. తాపం భరించలేక చిన్నా చితకా పక్షులు ఎండుటాకుల్లా చచ్చి పడిపోతున్నాయి. ప్రజలు ఇళ్లల్లో ఉండలేక కరణంగారి ఇంటి ముందు మర్రి చెట్టు నీడని చేరారు ఆ రోజు. రోహిణికార్తెలో ప్రబలమైన ఎండలకి రోళ్లు బ్రద్దలయ్యేవని అరవై య్యేళ్ల పెద్ద మనుషులు కుర్రాళ్ళకి వాళ్ల అనుభవాలు చెప్పుతున్నారు. ఇంతలో అపరాహ్ణం తిరిగి, 'హమ్మయ్య ఎండ చల్లబడుతోంది' అనుకునే సమయానికి ఆ మర్రి చెట్టు దగ్గరికి రొప్పుకుంటూ, రోజుకుంటూ పరుగెత్తుకొచ్చాడు నూకరాజు డాము సైటు నుంచి. వస్తూనే అగ్గిపిడుగులాంటి వార్త చెప్పాడు. కొండయ్య కొడుకు పరదేశి ఆ రోజు 'రాతి పణుకులు' పగులకొట్టడానికి మందుగుండు సామాను దట్టిస్తూండగా అది పేలిపోయి, వాడు తునాతునకలై చచ్చిపోయాడని.

"అమ్మమ్మ! ఎంత ఘోరం జరిగిపోయింది! పదండి" అంటే "పదండి" అని అక్కడున్న వారంతా ఎలా ఉన్న వాళ్లు అలా బయలుదేరి పరుగులాంటి నడకతో డాము సైటు చేరుకున్నారు. అలా వెళ్లిన వారిలో కరణం కొండబాబుగారూ ఉన్నారు.

వీరంతా చేరిన సమయానికి సైటు తుపాను వెలిశాక నిశ్శబ్దం ఆవరించినట్టుగా ఉంది. అందరూ శోక వదనాల్తో నోట మాట లేకుండా ఎక్కడి వాళ్ళక్కడ కూర్చుని ఉన్నారు. ఆధునిక విజ్ఞానం చేసిన వికటాట్టహాసం అక్కడి వారందర్నీ భయభ్రాంతుల్ని చేసింది. ఇటువంటి అనుభవం వారెప్పుడూ ఊహించనిది.

ముక్కలు ముక్కలుగా చితికిపోయిన పరదేశి శరీర భాగాల్ని ఒక్కొక్కటిగా దొరికినవన్నీ ఒక దగ్గరగా చేర్చి పెట్టారు. దానికి ఓ పక్కగా మోకాళ్లలో తల దూర్చి కూర్చుని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్నాడు కొండయ్య.

ముందుగా కరణం కొండబాబుగారే కొండయ్యని పలకరించే ధైర్యం చేశారు. దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేసి, "ఎంత ఘోరం జరిగిపోయింది కొండయ్యా!" అన్నారు. ఒక్కసారిగా సన్నిపాతం వచ్చిన వాడిలా విరుచుకుపడ్డాడు కొండయ్య. అతనిలోని దుఃఖం పెల్లుబికి వచ్చింది. "నేనేం పాపం చేశాను బాబయ్యా! నల్లకొండమ్మ తల్లి నాకీ శిక్ష ఎందుకు వేసింది బాబయ్యా!" అని కరణంగారి కాళ్లు పట్టుకొని ఏడిచాడు. కొంచెం సేదదీరి, మళ్ళీ తెరలు తెరలుగా దుఃఖం వస్తూ ఉంటే, "తప్పంతా నాదే బాబూ! మీరు చెప్పినట్టు గునుపూడిలో ఒదిలేస్తే వాడిని మిగుల్చుకుని ఉండేవాడిని. ఆ తల్లి వాడికి బదులు నన్ను తీసుకుపోయినా ఇంత బాధ ఉండేది గాదు బాబూ!" అని వాపోయాడు.

"ఊరుకో కొండయ్యా! ఇదంతా దైవలీల! మనం చేసేదీ చేయగలిగిందీ ఏమీ లేదు. వాడికలా రాసిపెట్టి ఉందంతే!" అని ఓదార్చారు కొండబాబుగారు. "పొద్దు పోతోంది. లేచి ఇక ముందు కార్యక్రమం కానివ్వండి!" అని స్థబ్దులై చూస్తూ ఉండిపోయిన వారిని లేవదీశారు.

ఒక్కొక్కటిగా ఎండు పుల్లలు చేర్చి చితి పేర్చారు. దానిపై పరదేశి శరీర భాగాల్ని పడుకోబెట్టారు. చితి అంటుకుంది. అగ్ని దేవుడు ఆవురావురుమంటూ నాలికల్ని చాస్తున్నాడు. ఈ ఘోరాన్ని చూడలేక కాబోలు సూర్య భగవానుడు పెనుగొండ వెనక్కి వెళ్లి పోయాడు. చితి బాగా అంటుకుని కాలుతోంది. లోకాన్ని చిరు చీకట్లు క్రమ్ముతున్నాయి. ఎదురుగా పెనుగొండ మీద రగులుకుంటున్న కార్చిచ్చు జ్వాలా తోరణంలా కనిపిస్తోంది. బ్రహ్మదేవుడి ఉద్యానవనంలో చెట్లు హుతాశుడి భీకరాట్టహాసానికి సమిధలుగా మారిపోతున్నాయి.

చితిలో నిప్పు బాగా రాజుకుంది. అగ్ని కీలలు తాపాన్ని విషంలా గ్రక్కుతున్నాయి. కాలే కర్రల్లో ఒక సమిధగా పరదేశి శరీరం కూడా......

భవిష్యత్తులో ఏదో ఒకనాడు 'తాండవ' రిజర్వాయరు పూర్తవుతుంది. గునుపూడిలో మెరకలన్నీ బంగారం పండుతాయి. ఇది మానవ కళ్యాణం కోసం మానవుడే చేసే మహాయజ్ఞం. ఈ యజ్ఞానికి కూడా సమిధలు....కావాలి మరి!!! ✷